రంగు మారిన నీరు.. ప్రజల అవస్థలు

- నగరంలో గత వారం రోజులుగా బురదనీరు సరఫరా
- కనీస అవసరాలకు కూడా పనికి రావడం లేదంటున్న ప్రజలు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరపాలక సంస్థ ద్వారా సరఫరా అవుతున్న రక్షిత మంచినీరు బురదమయంగా ఉంది. నగరం మొత్తం నీరు రంగు మారి దుర్వాసనతో కుళాయిల ద్వారా వచ్చే నీరు తాగేందుకు ప్రజలు జంకుతున్నారు. ఈ నీరు తాగలేక వాటర్ ప్లాంట్లవైపు పరుగులు పెడుతున్నారు.

రోగాలు ఖాయం

మంగళగిరి నగరంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని తాగితే రోగాల బారిన పడడం ఖాయమని ప్రజలు అంటున్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీరు పూర్తిగా రంగు మారి మట్టితో కూడిన బురదనీరు సరఫరా అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పరిధిలోని రాజీవ్ గృహకల్ప, టిడ్కో గృహ సముదాయం, భార్గవపేట, బాప్టిస్ట్ పేట, రత్నాల చెరువు, ఇందిరానగర్, శ్రీలక్ష్మీనరసింహస్వామి కాలనీ, కొప్పురావు కాలనీ, మంగళగిరి పట్టణంలో గత వారం రోజులుగా మురికినీరు సరఫరా అవుతోంది. నీరు దుర్వాసన రాకుండా ఎక్కువ మొత్తంలో బ్లీచింగ్ కలిపి సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీస అవసరాలకు కూడా నీరు పనికి రావడం లేదని అంటున్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించాలి

కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిని వినియోగించలేక ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లవైపు పరుగులు తీస్తున్నారు. గత వారం రోజులుగా క్యాన్‌కు రూ.20 వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని, కలుషిత నీరు సరఫరా కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ఇప్పటికే పట్టణంలో పలువురు రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



టిడ్కో గృహ సముదాయంలో సరఫరా అయిన రంగుమారిన నీరు



రత్నాల చెరువులో బురదమయంగా సరఫరా అయిన నీరు

కమిషనర్‌తో మాట్లాడిన వేమారెడ్డి

గత కొన్ని రోజులుగా కలుషితమైన తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు మంగళగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాతో ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై ప్రస్తుతం కృష్ణానదిలో వర్షాల కారణంగా వరదనీరు చేరి గుంటూరు చానల్ ద్వారా వస్తున్న నీరు రంగు మారిందని, ఆత్మకూరు హెడ్‌వాటర్ వర్క్స్‌లో ఇటీవల సాండ్ ఫిల్టర్ బెడ్ మార్చడం జరిగిందని కమిషనర్ వివరణ ఇచ్చారు.

పరీక్షలు చేస్తున్నాం



కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిని కాచి చల్లార్చిన తర్వాతనే తాగాలి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గుంటూరు చానల్ బురదనీటితో నిండిపోయింది. హెడ్‌వాటర్ స్కీమ్‌లో నీటిని శుద్ధి చేసి అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాతనే నీటిని విడుదల చేస్తున్నాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– కమిషనర్ అలీమ్ బాషా

పుర యాప్‌లో ఫిర్యాదు

స్థానికులు బురదనీరు వస్తుండడంతో పుర యాప్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వారికి ఫోన్‌లు చేసి వర్షాలు కురిసినపుడు ఇలా రావడం సహజమని, ఈ నీరు వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని, నీటిని కాచి చల్లార్చి తాగమని సలహాలు ఇస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎప్పుడు భారీ వర్షాలు, వరదలు వచ్చినా ఇంతలా బురదనీరు ఏనాడూ రాలేదని ఇప్పుడు ఎందుకు వస్తోందని, తక్షణమే పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భయంగా ఉంది



కుళాయిల ద్వారా గత కొన్ని రోజులుగా కలుషితనీరు సరఫరా అవుతోంది. ఆ నీటిని కనీస అవసరాలకు కూడా వాడుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నీరు తాగితే అనారోగ్యం బారిన పడతామని భయంగా ఉంది.

– అందె లక్ష్మణ్, టిడ్కో గృహ సముదాయం

తాగలేకపోతున్నాం



తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నీటి నుంచి దుర్వాసన వస్తుండడంతో ఆ నీటిని తాగలేకపోతున్నాం. వేడి చేసి చల్లార్చినా ఆ రంగు నీటిని తాగలేకపోతున్నాం.

– గోలి లక్ష్మి, టిడ్కో గృహ సముదాయం

అధికారులకు పట్టడం లేదు



ప్రజారోగ్యం గురించి ప్రభుత్వానికి గానీ, అధికారులకు గానీ ఏ మాత్రం పట్టడం లేదు. కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. తక్షణమే మంచి నీటిని సరఫరా చేయాలి.

– బియ్యం శ్రీనివాసరావు, రత్నాలచెరువు

నీట మునిగిన అప్రోచ్ రోడ్డు



నీటిలో మునిగిన మంచికలపూడి-కంఠంరాజు కొండూరు అప్రోచ్ రోడ్డు



రోడ్డు సరిగా లేకపోవడం వల్ల మంచికలపూడి రోడ్డు బురదమయం

దుగ్గిరాల: మంచికలపూడి నుంచి కంఠంరాజుకొండూరు డీబీఆర్‌సీ వాగుపై వంతెన నిర్మాణం కొనసాగుతుంది. ప్రత్యామ్నాయంగా వాగు దాటేందుకు అప్రోచ్ రోడ్డు మార్గం ఏర్పాటు చేశారు. వర్షాలకు అప్రోచ్ రోడ్డు నీట మునిగిపోవడం వల్ల తెలియకుండా కొత్తగా ఊరు వచ్చేవారు, రోజువారీ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మంచికలపూడి రైల్వే గేటు సమీపంలోని రోడ్డును తారురోడ్డు నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. నిర్మాణం సకాలంలో పూర్తి కాకపోడంతో వర్షాలకు చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి

తాడికొండ: విద్యార్థులకు కలుషిత ఆహారాన్ని పెట్టి వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న విట్ వర్సిటీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తుళ్లూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ అంటూ విద్యార్థుల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, తక్కువ రేట్‌కు భూమిని ప్రభుత్వం నుంచి తీసుకొని రాజధానిలోని విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇస్తామని చెప్పి మాట తప్పి రాజధానిలోని విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజుల పేరుతో వసూలు చేస్తూ, హాస్టల్లో ఉండే విద్యార్థులకు కలుషితమైన ఆహారం పెడుతున్న విట్ యూనివర్సిటీపై సమగ్ర విచారణ జరపాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రాజధానికి భూములిచ్చిన రాజధాని ప్రాంత విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడం నిలిపి వేయాలన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇప్పటివరకు రాజధాని విద్యార్థుల నుంచి యూనివర్సిటీ వసూలు చేసిన ఫీజులు మొత్తాన్ని వాపస్ చేయించాలని కోరారు. మెస్ నిమిత్తం ఫీజులు కట్టి కూడా ఆహార నాణ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు తినకుండా పస్తులు ఉండి క్లాసులకు వెళ్లడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కలుషితమైన ఆహారం అందించడం పట్ల విద్యార్థులంతా ఆందోళనకు దిగటం బట్టి చూస్తే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుందని, మెస్‌లో క్రమం తప్పకుండా ఆరోగ్యం భద్రత చర్యలు చేపట్టాలని, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో పరీక్షలు చేయించాలని కోరారు. నాణ్యమైన ఆహారం అందించమని కోరడమే నేరంగా పరిగణిస్తూ యాజమాన్యం విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయటం, బెదిరింపులకు దిగడం మంచి పద్ధతి కాదని, విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తే విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రవి కోరారు.

కొండవీటి వాగుపై చంద్రబాబు అవగాహన కల్పించుకోవాలి

వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



కొండవీటి వాగును పరిశీలిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



కొండవీటి వాగును దాటలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

మంగళగిరి: రాజధాని కట్టడాలు, కొండవీటి వాగు ముంపు వలనే 70 వేల ఎకరాల పంట మునిగిందని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం నీరుకొండ వద్ద కొండవీటి వాగు వలన మునిగిన పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజధాని నిర్మాణంపై కొండవీటి వాగు మళ్లింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా అవగాహన కల్పించుకోవాలన్నారు. కొండవీటి వాగు మళ్లింపు వలన రాజధాని కట్టడాల వలన కాజా, చినకాకాని, పెదకాకాని, నంబూరు గ్రామాల్లో 70 వేల ఎకరాల్లో పంటలు మునిగిపోవడంతో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వచ్చిన సమయంలో కొండవీటి వాగు కారణంగా మండలంలోని నీరుకొండ, కురగల్లు గ్రామాలు సైతం ముంపుకు గురవుతున్నాయన్నారు. సీఆర్‌డీఏ అధికారులకు గానీ, నీటి పారుదల అధికారులు గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే కొండవీటి వాగు ముంపుపై నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడాలని కోరారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి



దీక్ష శిబిరం వద్ద యూనియన్ నాయకులు

తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన నాయకులు సూర్యప్రకాశరావు, దానయ్యలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు గత 257 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ గానీ స్పందించకపోవడం దారుణమని అన్నారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు నవనీతమ్మ, శివమ్మ, గంగాధర్‌రావు, ఇస్మాయిల్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీస్తు సువార్త అవగాహన సదస్సు



దుగ్గిరాల: సమాజంలోని పిల్లలు బాధ్యతగా ఉండాలని లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్ అన్నారు. ఆదివారం ఈమని గ్రామంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 27 సంఘాల పిల్లలకు ప్రొజెక్టర్ ద్వారా క్రీస్తు బోధనలపై అవగాహన కల్పించి, అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.కోటయ్య, కె.వెంకట్రావు, బి.జెనర్జీ, సుజాత, సియోన్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మతల్లి జాతర



ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి రాజనారాయణ

గుంటూరు రూరల్: మండలంలోని స్వర్ణభారతినగర్‌లో కొలువైఉన్న శ్రీ ముత్యాలమ్మతల్లి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మాజీ ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లాలకు గుర్రం జాషువా పేరు పెట్టాలి



దుగ్గిరాల: గుంటూరు జిల్లాకు గానీ, పల్నాడు జిల్లాకు గానీ మహాకవి పద్మభూషణ్ గుర్రం జాషువా పేరు పెట్టాలని జాషువా కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పెద్దేటి యోహాను, గౌరవ సలహాదారు షేక్ సుభాని కోరారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఉన్న జాషువా విగ్రహం దగ్గర వారు మాట్లాడుతూ గతంలో టంగుటూరి ప్రకాశం పంతులు సేవలకు గుర్తుగా ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారని, అదే విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించి సాహిత్యంలో జాషువా అందించిన విశేష సేవలకు గుర్తింపుగా రానున్న రోజుల్లో గుర్రం జాషువా పేరును గుంటూరు జిల్లాకు గానీ, పల్నాడు జిల్లాకు గానీ పెట్టాలని అన్నారు. తొలుత మహాకవి గుర్రం జాషువా విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి గురివిందపల్లి సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు బోనాల ఉత్సవాలు



పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరంలోని పోలేరమ్మ గుడిలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ఆదివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొన్నారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాది పోలేరమ్మ అమ్మవారికి భక్తులు వేడుకగా పూజలు నిర్వహించి బోనాలు సమర్పిస్తున్నారని, ఈ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేర స్వామి, సంఘం నాయకులు గంజి రవీంద్రనాథ్, వంగర లక్ష్మయ్య, కొల్లి ప్రసాద్, తిరువీధుల కిరణ్, బిట్రా భాస్కరరావు, వెనిగళ్ళ హనుమంతరావు, కొల్లి పూర్ణచంద్రరావు, శివాజీ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొలుపుల మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసియున్న ఆళ్ళ వారి శ్రీ తినంకమ్మతల్లి కొలుపుల మహోత్సవం రెండవరోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుఝామున దేవర ఇంటినుంచి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అమ్మవారికి మహా పొంగలి కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి తీర్థ ప్రసాదం అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ స్వర్ణ వేంకటేశ్వరస్వామి లయ బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రాతఃకాలార్చన, విశేష పూజ, వేంకటేశ్వరస్వామి వార్లకు పంచామృత స్నపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి గద్దె అమరనాథ్ పర్యవేక్షించారు.

గుంతల రోడ్డుతో చింత!



పెదకాకాని: పెదకాకాని మండలం నుంచి అగతవరప్పాడు గ్రామానికి ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి వెళ్ళే రోడ్డు గోతుల మయంగా మారింది. రోడ్డుపై రాళ్లు లేచి దెబ్బతినడంతో ఆ రోడ్డుపై వెళ్ళే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అగతవరప్పాడు గ్రామంలోకి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

‘నీరాజనం ఖండకావ్యం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఫిరంగిపురం: మానవుడు మహాత్మునిగా మారేందుకు, వారిలో చైతన్యం కలిగించేందుకు నీరాజనం ఖండకావ్యం ఎంతో దోహదపడుతుందని ప్రవచన చక్రవర్తి నారాయణం ప్రసాదాచార్యులు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌సీజేసీ కళాశాలలో ఆదివారం రచయిత ఎంఎఫ్.జోసఫ్ రచించిన ‘నీరాజనం ఖండకావ్యం’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అర్థమయ్యేలా సరళమైన రీతిలో రచన సాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్ రత్నాకరం రాము, యాపిల్ స్కూల్ అధినేత ఇమ్మడి రవికుమార్, మహ్మద్ రఫీ, ఆకురాతి సాంబశివరావు, గోలి ఇన్నయ్య, ఘన్నుబేగ్, వి.శౌరి, రాయప్రోలు చంద్రశేఖరశర్మ, ఖాజావలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అనారోగ్య బాధితులకు తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి 13వ వార్డుకు చెందిన షేక్ హుస్సేనమ్మకు రూ.75,406, 3వ వార్డుకు చెందిన వనమా స్వర్ణలతకు రూ.21,984, 18వ వార్డుకు చెందిన మొగలి శ్రీనుకు రూ.25,541, 20వ వార్డుకు చెందిన నమ్మి రజనికి రూ.29,247, కుంభ నాగమణికి రూ.35,000, 22వ వార్డుకు చెందిన సిద్ధు పుష్పసాయికి రూ.20,464, వసూరి రవికుమార్‌కు రూ.40,350 అందజేశామని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, కాకుమాను కుమార్, కాటాబత్తుని నిర్మల, శివ, నాగేశ్వరరావు, షేక్ సైదా, గోలి జోజమ్మ, సుధాకర్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మొక్కలు నాటి, పేదలకు పండ్లు పంపిణీ



ఫిరంగిపురం: ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆరోగ్యనగర్ ఎంపీపీ పాఠశాలలో ఏపీడబ్ల్యూజే సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే సభ్యులు శౌరయ్య, జి.వెంకట్, ఎం.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం పి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహం బహూకరణ



తెనాలి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దుగ్గిరాల యాదవపాలెంలోని శ్రీకృష్ణ మందిరానికి స్వామి వారి ఇత్తడి ఉత్సవ విగ్రహాన్ని ఆ గ్రామానికి చెందిన కాకా మహేష్, మాధవి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఈమని పీఏసీఎస్ అధ్యక్షుడిగా బుల్లియ్య



దుగ్గిరాల: ఈమని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా కొమ్మూరి బుల్లియ్య ప్రమాణస్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ఈమని గ్రామంలో అధ్యక్షుడిగా కె.బుల్లియ్య, డైరెక్టర్లుగా గోపిశెట్టి శ్రీను, తాడిబోయిన శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారిని ఎంపీపీ షేక్ జబీన్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉజ్వల హరిణి, కె.శ్రీ అనిత, వి.ఝాన్సీరాణి, పి.సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: పట్టణంలోని సివిల్ జూనియర్ కోర్టులో సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడే అన్ని కేసులకు అదాలత్‌లో పరిష్కారం లభించి కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తెనాలి రూరల్: గంజాయి విక్రయిస్తూ తాగుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు, ఎస్ఐ షేక్ కరిముల్లాకు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి పట్టణ మారిస్‌పేట నుంచి చుండూరు మండలం చినపరిమికి వెళ్లే మార్గంలో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తూ, తాగుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1,700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెనాలి, గుంటూరు, పొన్నూరుకు చెందిన వారని పోలీసులు తెలిపారు.